


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 25-06-2022 సంపుటి : 03 సంచిక : 272 పేజీలు : 4 వెల : రూ 3-00


# పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ భేటీ ముగిసింది. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని కోనసీమ జిల్లాను అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్పు చేస్తూ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. దాదాపు మూడు గంటలపాటు సాగిన ఈ భేటీలో కేబినెట్ అజెండాలోని దాదాపు 42 కీలక విషయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

కేబినెట్ ఆమోదించిన అంశాలివే..

- ఈ నెల 27న అమలు చేయబోతోన్న అమ్మఒడి పథకానికి కేబినెట్ ఆమోదం
- 43 లక్షల 96వేల 402 మంది తల్లుల ఖాతాల్లోకి అమ్మఒడి నిధులు
- మరో 4 సంక్షేమ పథకాలకు కేబినెట్ ఆమోదం
- రాష్ట్రంలో రూ.15వేల కోట్లతో ఏర్పాటు కానున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌కు కేబినెట్ ఆమోదం
- జులైలో అమలు చేసే జగనన్న విద్యా కానుక, వాహన మిత్ర, కాపు నేస్తం పథకాలకు ఆమోదం
- వైద్య శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- 3,530 ఉద్యోగాలు మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల లో భర్తీ కి ఆమోదం
- 15 వేల కోట్ల పెట్టుబడి పెట్టె ఆదాని గ్రీన్ ఎనర్జి ప్రాజెక్ట్ కు ఆమోదం
- దేవాలయాల కౌలు భూములు పరిరక్షణ చర్యలపై కేబినెట్ ఆమోదం
- వంశధార ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ.216 కోట్లు మంజూరుకు ఆమోదం
- అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖకు గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం
- జగనన్న ఎంఐజీ లే అవుట్ల అభివృద్ధి పాలసీకి కేబినెట్ ఆమోదం?
- మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో 3,530 ఉద్యోగాల భర్తీకి ఆమోదం
- సంక్షేమ కేలండర్‌కు మంత్రి మండలి ఆమోదం
- ఆక్వాసాగు సబ్సిడీ 10 ఎకరాలు ఉన్నవారికి సైతం వర్తింపు
- పాత జిల్లాల జడ్పీ ఛైర్మన్ల కొనసాగింపునకు ఆమోదం
- సత్యసాయి జిల్లాలో 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

## కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు ఖరారు.

# హై అలెర్ట్



విజయవాడ, జూన్ 24, (న్యూస్ పల్స్) ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కోనసీమ జిల్లాకు డా.బీఆర్.అంబేద్కర్ పేరును ఖరారు చేస్తూ ఆమోదముద్ర వేసింది. దీంతో ఇకపై కోనసీమ జిల్లా డా.బీఆర్.అంబేద్కర్ జిల్లాగా మారనుంది. కేబినెట్‌లో 32వ అంశంగా కోనసీమ జిల్లా పేరును కేబినెట్ ప్రతిపాదించింది. ఇటీవల కోనసీమ జిల్లా మార్పు అంశంపై అమలాపురంలో తీవ్ర ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఇళ్లకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులపాటు కోనసీమ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలుచేయడమే కాకుండా ఇంటర్నెట్‌ను కూడా అధికారులు నిలిపేశారు. అమలాపురం అల్లర్ల ఘటన లో దాదాపు 150 మందిపై కేసులు నమోదయ్యాయి. పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ కూడా జరిపారు.కాగా ప్రభుత్వం తాజా నిర్ణయంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా పోలీసులు అలర్ట్ అయ్యా రు. జిల్లాలో 1300 మంది పోలీసులతో గస్తీ ఏర్పాటు చేశారు. మరోవైపు కోనసీ మ జిల్లా అదే పేరు కొనసాగించాలని కోరుతూ కోర్టులో పి టి ష న్ లు దాఖల య్యాయి. ఈ అంశంపై ప్రభుత్వం ఎలాం టి నిర్ణయం తీసుకోకుండా ఉండేందుకు స్టే ఇవ్వాలని కోరుతూ ఏపీ హైకోర్టులో 12 పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లన్నింటిపై కలిసి విచారించాలని కోర్టు నిర్ణయించింది.

# మోడీకి సుప్రీం క్లీన్ చిట్


న్యూఢిల్లీ, జూన్ 24, (న్యూస్ పల్స్) 2002 గుజరాత్ అల్లర్ల కేసులో అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోదీకి సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ ఇషాన్ జఫ్రీ భార్య జకియా జఫ్రీ సిట్ దర్యాప్తును సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆమె వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇవాళ తోసిపుచ్చింది. సిట్ నివేదికను సమర్థిస్తూ గతంలో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశాలతో తాజాగా జస్టిస్ ఏ.ఎం.ఖన్విల్కర్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, దినేశ్ మహేశ్వరి, సిటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. సిట్ ఇచ్చిన తీర్పును సుప్రీం సమర్థించింది. 2002, ఫిబ్రవరి 28న అహ్మదాబాద్‌లోని గుల్‌బర్గ్ సొసైటీలో అల్లరి మూకలు జరిపిన దాడిలో కాంగ్రెస్ ఎంపీ ఇషాన్ జఫ్రీ సహా 68 మంది మరణించారు. దీనిపై విచారణ జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు



బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసుతో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ సహా మరికొంతమందికి ఎలాంటి సంబంధం లేదని సిట్ తేల్చింది. సిట్ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ జకియా పలుకోర్టులను ఆశ్రయించారు. మార్చి 2008న సుప్రీంకోర్టు నియమించిన సిట్ జఫ్రీ ఆరోపణలపై విచారణ చేపట్టింది. 2010లో అప్పటి గుజరాత్ సీఎంగా ఉన్న మోదీని సిట్ దాదాపు తొమ్మిది గంటలకు పైగా ప్రశ్నించింది. అనంతరం ఈ కేసులోని అన్ని ఆరోపణల నుంచి ప్రధాని మోదీని సిట్ తప్పించింది.ప్రధాని మోదీకి ప్రత్యేక దర్యాప్తు బృందం క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌తో కలిసి 2012 ఫిబ్రవరి 9న జఫ్రీ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే కోర్టు సిట్ ఉత్తర్వులను సమర్థించడంతో జఫ్రీ, సెతల్వాద్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. గుజరాత్ హైకోర్టులోనూ చుక్కెదురవడంతో సిట్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సుప్రీంను ఆశ్రయించగా.. తాజాగా సర్వోన్నత న్యాయస్థానం కూడా వారి పిటిషన్‌ను కొట్టివేసింది.

# రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్ము నామినేషన్

న్యూఢిల్లీ, జూన్ 24, (న్యూస్ పల్స్)ఎన్డీఏ కూటమి తరపున ద్రౌపది ముర్ము రాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేబినెట్ మంత్రులు సహా మద్దతు పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నామినేషన్ పత్రాలను ఆమె అందజేశారు. ద్రౌపది ముర్ము నామినేషన్‌ను ప్రధాని మోదీ ప్రతిపాదించారు. కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మద్దతు పార్టీల నేతల సంతకాలతో నాలుగు సెట్ల నామపత్రాలను ఆమె దాఖలు చేశారు. మినేషన్ దాఖలు చేసే కంటే ముందు ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహానికి నివాళిఅర్పించారు. ఇదిలా ఉంటే ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి తెలుగు రాష్ట్రాల నుంచి వైసీపీ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. నామినేషన్ కార్యక్రమానికి వైసీపీ నుంచి విజయసాయి రెడ్డి, లోక్‌సభాపక్ష నేత మిథున్ రెడ్డి హాజర య్యారు.నామినేషన్ దాఖలుకు ఒకరోజు ముందుగా గురువారమే ఢిల్లీకి చేరుకున్న ద్రౌపది ముర్ము.. ఒడిశా భవన్‌లో బస చేశా రు. భువనేశ్వర్ విమానాశ్రయంలో పలు పార్టీల నాయకులు, అభిమానులు ఆమెకు వీడ్కోలు పలికారు. గిరిజన నృత్యాలతో, సంప్రదాయ దుస్తులతో వచ్చిన అభిమానులతో అక్కడంతా కోలాహలం కనిపించింది. ఢిల్లీకి చేరుకున్న అనంతరం ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో ద్రౌపది ముర్ము భేటీ అయ్యారు. విమానాశ్రయం నుంచి నేరుగా ప్రధానమంత్రి నివాసానికి ఆమె వెళ్లి, తనను రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఒడిశాలోని బైడపోసి గ్రామంలో 1958 జూన్ 20న సంతాల్ అనే సంప్రదాయ గిరిజన కుటుంబంలో ద్రౌపది ముర్ము జన్మించారు. టీచర్‌గా పనిచేస్తూ భారతీయ



జనతా పార్టీ పట్ల ఆకర్షితురాలై ఆమె బీజేపీలో చేరారు. కార్యకర్త నుంచి జాతీయ కమిటీలో చోటు పొందే స్థాయికి ఎదిగారు. ఒడిశాలో 2000-2002 మధ్య సంకీర్ణ ప్రభుత్వంలో బీజేపీ నుంచి ద్రౌపది ముర్ము మంత్రిగా పనిచేశారు. జార్ఖండ్ తొలి మహిళా గవర్నర్‌గా పనిచేశారు. ద్రౌపది ముర్ము భర్త, ఇద్దరు కొడుకులు గతంలో చనిపోయారు. ప్రస్తుతంఒకుమార్తె ఉంది. కాగా జులై 18న రాష్ట్రపతి ఎన్నికలు జరగనుండగా అదే నెల 21న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా..ఈనెల29తోగడువు ముగియనుంది. మరోవైపు ఈనెల 27న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా తెలిపారు.

# ద్రౌపదీకి జగన్ మద్దతు

విజయవాడ, జూన్ 24, (న్యూస్ పల్స్) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్టు ఏపీలోని అధికార పార్టీ వైఎస్ఆర్‌సీపీ గురువారం రాత్రి ప్రకటించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా గిరిజన మహిళకు రాష్ట్రపతిగా అవకాశం ఇవ్వడం శుభపరిణామమం అంటూ వైసీపీ పేర్కొంది. రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము గెలిస్తే.. ఈ స్థానాన్ని దక్కించుకున్న మొదటి గిరిజన మహిళగా చరిత్రలో నిలిచిపోతారని తెలిపింది. గడిచిన మూడేళ్లుగా సామాజిక న్యాయంలో దేశంలోనే పెద్ద పీట వేస్తున్న పార్టీగా.. ద్రౌపది ముర్ముకే మద్దతు తెలుపుతున్నట్టు వైఎస్ఆర్‌సీపీ పేర్కొంది.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి తమ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యత ఇస్తుందని పార్టీ తెలిపింది. గత



మూడేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని, కేబినెట్‌లో వారికి మంచి ప్రాతినిథ్యం కల్పించారని, 70 శాతం మంది వారే ఉండేలా చూశారని పేర్కొంది. కేబినెట్ సమావేశం కారణంగా శుక్రవారం ముర్ము నామినేషన్ దాఖలుకు ముఖ్యమంత్రి హాజరు కావడం లేదని వైఎస్సార్‌సీపీ తెలిపింది. అయితే రాజ్యసభా పక్షనేత ఎంపీ విజయసాయి రెడ్డి, లోక్‌సభాపక్ష నేత ఎంపీ మిధున్‌రెడ్డి హాజరవుతున్నట్లు వైసీపీ వెల్లడించింది.ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జూలై 18న, కౌంటింగ్ 21న జరగనుంది.

# అసెంబ్లీలో బలపరీక్షకు సిద్ధం

## రెబెల్ ఎమ్మెల్యేలకు సంజయ్ రౌత్ సవాల్

:ముంబై : అసమ్మతి నేత ఏక్‌నాథ్ షిండే శిబిరంలో ఎమ్మెల్యేల సంఖ్య పెరగడంతో మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభం తీవ్రరూపు దాల్చింది. సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు వ్యతిరేకంగా మెజారిటీ సేన ఎమ్మెల్యేలు ఏక్‌నాథ్ షిండే గూటికి చేరిన క్రమంలలో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో జరిగే బలపరీక్షలో ఠాక్రే సర్కార్



విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తమను వీడిన ఎమ్మెల్యేలు తిరిగి పార్టీ గూటికి చేరేలా అవకాశం ఇచ్చామని, అయినా వారు స్పందించడంలో చాలా జాప్యం జరిగిందని అన్నారు. వారు ముంబైలో అడుగుపెట్టాలని తాము ఇప్పుడు డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. బలపరీక్షకు సిద్ధం కావాలని రెబెల్ ఎమ్మెల్యేలకు రౌత్ సవాల్ విసిరారు.ఎంవీఏ ప్రభుత్వం మిగిలిన రెండున్నరేండ్ల పదవీ కాలం పూర్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బలపరీక్షలో తాము విజయం సాధిస్తామని రెబెల్ ఎమ్మెల్యేలు తప్పుడు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌తో పాటు కాంగ్రెస్ నేతలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. రెబెల్ శిబిరంలోని 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన వర్గం డిప్యూటీ స్పీకర్‌కు లేఖ రాసింది.

# దేశంలో భారీగా పెరిగిన కరోనా కేసులు..

## కొత్తగా 17,336 మందికి పాజిటివ్

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు భారీగా పెరిగాయి. వైరస్ మరోసారి విజృంభిస్తుండటంతో పెద్దసంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. గురువారం 13 వేల మంది కరోనా బారినపడగా, నేడు కొత్తగా 17,336 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. దీంతో మొత్తం కేసులు 4,33,62,294కు చేరాయి. ఇందులో 4,27,49,056 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,24,954 మంది మృతిచెందారు. మరో 88,284 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో 13 మంది మరణించగా, 13,029 మంది వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జీ అయ్యారు.కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో 5218 కేసులు ఉన్నాయి. కేరళలో 3890 కేసులు, ఢిల్లీలో 1934, తమిళనాడులో 1063, హర్యానాలో 872, కర్ణాటకలో 858 కేసుల చొప్పున నమోదయ్యాయి. కాగా, పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో రోజువారీ పాటివిటీ 4.32 శాతానికి చేరిందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అదేవిధంగా యాక్టివ్ కేసులు 0.20 శాతం, రికరీ రేటు 98.59 శాతం, మరణాలు 1.21 శాతంగా ఉన్నాయని పేర్కొన్నది. దేశంలో ఇప్పటివరకు 196.77 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని తెలిపింది.



# సంపాదకీయం

శనివారం 25-06-2022

## మారుతున్న నేరాల శైలి

సమాచార వ్యవస్థను పటిష్టపరిచి నేరాలను అరికట్టుటకు చేయు ప్రయత్నానికి అవినీతి ఒక సవాలుగా మారింది.బంగారం అక్రమ రవాణా, కిడ్నాప్, అంతర్జాతీయ వ్యాపారంలో ఆర్థిక నేరాలు. రాష్ట్ర, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలలో ఇవి జరుగుతుంటాయి. అన్ని నేరాలు ఒక్కరే చేయడం సాధ్యపడదు. ఎవరికి వారు ఎంచుకున్న విషయాలకు యాజమాన్య విధానాలుంటాయి. అతనొక 'బాస్'లాగా వ్యవహరిస్తాడు. ఆ బాస్ కొనసాగించే చట్ట విరుద్ధ సంపాదన, వ్యాపార నేరాల ప్రక్రియలు, అప్రకటిత ప్రాజెక్టుల కార్యకలాపాలుగా గోచరిస్తాయి. దానికి పెట్టుబడులుంటాయి. అర్హులైన ఉద్యోగులుంటారు. వాహన సంపత్తి ఉంటుంది. సమాచార సేకరణ విధానముంటుంది. దాడులు, ప్రతి దాడులు తదితర కార్యకలాపాలెన్నియో జరిగిపోతుంటాయినిస్తేజంగా నిలిచిన పాలనా వ్యవస్థ మూలంగా బీదలు బీదలుగానే ఉన్నారు. ధనికులు మాత్రం అధిక ధనవంతులుగా ఎదుగుతూ సామాజిక అంతరాలకు ప్రతీకగా నిలిచారు. అవినీతి తత్వం, నేరతత్వాల ప్రభావంతో కలుషితమైన నేటి సామాజిక స్థితిగతులను ఈ రకంగా అర్థం చేసుకొనవచ్చు.మనుషులున్నారు కనుకనే మంచి మనుషులున్నారు. జనులున్నారు కనుకనే జనకంటకులున్నారు. బీదలున్నారు కనుకనే ధనికులు వెలుగుతున్నారు. ధనికులున్నారు కనుకనే బీదలు నలుగుతున్నారు. మంచీ చెడుల చిట్టాయే మనమెంచుకున్న చట్టం. ప్రజాస్వామ్యం ఒక ప్రచారం. దాని వక్రీకరణ మన ఆచారం. చట్టం బీదలను శాసిస్తుంటే, చట్టాన్ని ధనికులేలుతుంటే, చట్టాన్ని చదువలేని పేదలకు పిట్ట కథల పుస్తకం మన చట్టం.కాలంలో జరుగుచున్న నేరాల శైలి రెండు రకాలు. మొదటిది ఆకలి నేరం. రెండవది వ్యాపార నేరం. మొదటి రకంలో మనిషి ఆకలి తట్టుకోలేక నేరానికి ఉపక్రమిస్తాడు. అతని నేరపూరిత ఆలోచన అంతవరకే పరిమితమవుతుంది. పోలీసులకు పట్టుబడితే నేరాన్ని ఒప్పుకుంటాడు. న్యాయస్థానం విధించే శిక్షను అనుభవిస్తాడు. ఆ నేరం కారణంగా సొమ్మును కోల్పోయినతడు నష్టపోతాడు తప్ప సమాజానికి, దేశానికి ప్రభావ పూరిత నష్టం చేకూరే అవకాశాలు చాలా అరుదు. అదే, వ్యాపార నేరాలు మొదటి రకానికి విరుద్ధ రీతిలో జరుగుతుంటాయి. అలాంటివాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్జాతీయ ఉగ్రవాదం, హవాలా, పోస్‌పోర్టుకు సంబంధించినవి.అటువంటి కార్యకలాపాల ప్రాథమిక ఉద్దేశం అతి తక్కువ సమయంలో అమితమైన ధన సంపత్తిని పోగుచేసుకోవడం. మరికొందరికేమో శత్రుదేశాలు రచించిన ప్రణాళికలను అమలు చేసి దేశ భద్రతలకు విఘాతం కలిగించడం. పొరుగు దేశంలో ముద్రించబడిన దొంగనోట్లను భారతదేశంలో అక్రమంగా పెద్దయెత్తున చెలామణి చేయడం. అలాంటి నేరస్థుల ముఖ్య ఉద్దేశం భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచడం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమంగా ప్రజల వాడుకకు పంపిణీ చేయడంలో గల ముఖ్య ఉద్దేశం డబ్బు సంపాదన. యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చి వారిని పూర్తిగా బలహీనపరచడమే. యువత బలహీనపడితే దేశం శక్తి సంపన్నంగా మనగలగడం కష్టసాధ్యమైన పనియే. నేరగాళ్లకు, స్వార్థ చింతన గల రాజకీయ నాయకులకు ఆత్మీయ బంధాలేర్పడతాయి. చరిత్రను అవలోకించినప్పుడు,రాజకీయం, నేరం ఒకే నాణానికున్న రెండు పార్శ్వాలుగా విదితమవుతుంది. ప్రతి పౌరుడు, ప్రతి పోలీసు అధికారి రాజకీయ నాయకులకు సామీప్యంగా మెదలే విషయంలో స్వీయ నియంత్రణ పాటించడం అవసరం.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేటి కాలంలో ఎంతో విరివిగా సాగుతున్న అంతర్జాతీయ వ్యాపారం. అంతర్జాతీయ ఉగ్రవాద కార్యకలాపాలకు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలది విడదీయలేని బంధం.డబ్బును ఒక వ్యక్తి లేదా సంస్థ ఇతర స్థానాలలో గల వ్యక్తులకు లేదా సంస్థలను చేరవేయుట హవాలా పద్ధతి. స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మారణాయుధాల రవాణా, లంచాల వ్యవహారం తదితర వ్యాపారాలలో హవాలా పద్ధతి ద్వారా లావాదేవీలను కొనసాగిస్తుంటారు.సాధారణంగా ఉగ్రవాద చర్యలకు పాల్పడువారు, మనీ లాండరింగ్, బంగారం అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా తదితర కార్యకలాపాలను కొనసాగించేవారు వేష భాషలను మార్చుకుని అనుమానస్పద ప్రయాణాలను సాగిస్తారు. నిఘా విభాగాలకు పట్టుబడకుండా తప్పించుకునేందుకు నకిలీ పాస్‌పోర్టులను పొందుతారు. బంగారం అక్రమ రవాణాకు కొత్త విధానాలను రచిస్తాడు. కిడ్నాప్ నేరం కూడా జాతీయంగా, అంతర్జాతీయంగా జరుగుతూ పోతున్నది. నమ్మించి మోసపూరితంగా బ్యాంకుల నుంచి డబ్బు లాగుతుంటారు. అలాంటి దేశద్రోహ వ్యాపారాలను అరికట్టగలిగితే భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలబడగలదు. ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధిని ప్రదర్శించుకోవలసి ఉంది.

## అంతు పట్టని కమలం వ్యూహం

విజయవాడ, జూన్ 24, (న్యూస్ పల్స్) భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆంధ్రప్రదేశ్ విషయంలో స్పష్టమైన వైఖరితోనే ఉన్నట్లు కనపడుతుంది. జగన్ ను నమ్ముతున్నట్లే ఉంది. పవన్ కల్యాణ్ కు ఈ మేరకు సంకేతాలు పంపినట్లు చెబుతున్నారు. టీడీపీతో కలిసి ప్రయాణం చేసే ప్రసక్తి లేదని కేంద్ర నాయకత్వం కూడా అభిప్రాయపడుతుంది. తమకు నమ్మకమైన స్నేహితుడు కావాలని, అవసరాల కోసం వదులుకునే చంద్రబాబు లాంటి వ్యక్తి కాదని పవన్ కల్యాణ్ కు తెగేసి చెప్పేటట్లే కనపడుతుంది. పవన్ కల్యాణ్ కు బీజేపీ ఒక రూట్ మ్యాప్ ఇవ్వాలనుకుంటుంది. అది కేవలం జనసేన, బీజేపీ లు మాత్రమే పోటీ చేసేందుకు సిద్ధమవ్వాలని ఆయనకు త్వరలోనే తెలియజేయనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి అభ్యర్థి విషయం ఎన్నికల అనంతరం చర్చిద్దామని, ఏ రాష్ట్రంలోనూ తాము సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించబోమని పవన్ కల్యాణ్ కు బీజేపీ తెలియజేయనున్నట్లు తెలిసింది. అయితే పవన్ కల్యాణ్ కు కొన్ని హామీలు ఇచ్చేందుకు మాత్రం కేంద్ర నాయకత్వం సిద్ధమయిందని తెలిసింది.2029 నాటికి ఏపీ రాజకీయ పరిస్థితులు మారతాయని, దానిని అంచనా వేసుకుని ఆలోచించుకోవాలని కూడా బీజేపీ నాయకత్వం పవన్ కు చెప్పనుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నది వారి వాదన. ఇప్పటికే చంద్రబాబు కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న విషయాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు. పక్క రాష్ట్రంలో పొత్తు పెట్టుకున్నప్పటికీ అది చంద్రబాబు నైజం అని, చంద్రబాబును నమ్మడం వేస్ట్ అని పవన్ కు కేంద్ర నాయకత్వం హితబోధ చేసే అవకాశమూ లేకపోలేదు. 2024 ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా అన్ని రకాలుగా పార్టీకి అండదండలుంటాయని బీజేపీ పెద్దలు పవన్ కు హామీ ఇవ్వనున్నారని సమాచారం. ఆర్థికంగానే కాకుండా కేంద్రంలో కూడా అవసరమైతే అవకాశం కల్పిస్తామని కూడా పవన్ కు స్పష్టమైన హామీ ఇస్తారని చెబుతున్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయోయన్న సందేహం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో జగన్ నే బీజేపీ పెద్దలు నమ్ముకుంటారన్నది హస్తిన నుంచి వినపడుతున్న టాక్.

## వంట నూనెల ఊరట



హైదరాబాద్, జూన్ 24, (న్యూస్ పల్స్) అంతర్జాతీయంగా ధరలు కాస్త తగ్గడం, ప్రభుత్వ చర్యల వల్ల రిటైల్ మార్కెట్‌లో వంట నూనెల ధరల తగ్గుముఖం పట్టాయని ఫుడ్ సెక్రటరీ సుదర్శన్ పాండే తెలిపారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం పల్లినూనె కాకుండా మిగతా ప్యాకేజీ వంట నూనెలు రిటైల్ మార్కెట్‌లో స్వల్పంగా తగ్గాయి. ఈ నెల ప్రారంభంలో పల్లినూనె రూ.150 నుంచి రూ.190 ఉంది. గత వారం ఎడిబల్ ఆయిల్ కంపెనీలు అయిన అదానీ విల్మర్, మదర్ డైరీ పలు రకాల వంట నూనెలపై రూ. 10 నుంచి రూ.15 వరకు తగ్గించాయి. తగ్గిన ధరలతో స్టాక్ త్వరలోనే మార్కెట్‌లోకి వస్తుందని రెండు కంపెనీలు ప్రకటించాయి. "ప్రభుత్వం సరైన సమయంలో చర్యలు తీసుకోవడం వల్ల వంట నూనెల ధరలు తగ్గాయి" అని పాండే చెప్పారు. కేవలం ఎడిబుల్ ఆయిల్స్ కాకుండా రిటైల్‌లో గోధుమలు, గోధుమ పిండి ధరలు తగ్గాయని చెప్పారు. ప్రముఖ వంట నూనెల ఎమ్మార్పీ రేట్లు రూ.10 నుంచి రూ. 15 తగ్గినట్లు ఆహార శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు.

## సైకిల్ పరిస్థితి సీరియస్

విజయవాడ, జూన్ 24, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఎన్నికలకు శ్రమించాల్సిందే. తన ఓటు బ్యాంకును పెంచుకోవాలంటే అన్ని రకాలుగా స్వేదం చిందించాల్సిందే. ఈసారి ఎన్నికల్లో కమ్యునిస్టులు తప్ప చంద్రబాబుతో ఎవరు కలవని పరిస్థితి నెలకొంది. ఇన్నాళ్లూ జనసేనతో కలసి పోటీ చేయాలనుకున్నారు. కానీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పరిస్థితి చూస్తుంటే ఒంటరిగానే బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. చంద్రబాబు దాదాపు ఒంటరిపోరుకు మానసికంగా సిద్ధమవ్వాల్సిందే. ఇప్పటి సిట్యుయేషన్ చూస్తుంటే అదే అనిపిస్తుంది.మహానాడు సక్సెస్ కావడం, మినీ మహానాడులు విజయవంతం అవుతుండటం కొంత ఊరటనిచ్చే అంశమైనా.. ఎన్నికల నాటికి ఆ హీట్ ను చంద్రబాబు నిలబెట్టుకగలిగాలి. పర్చూరు లో పవన్ కల్యాణ్ ప్రసంగం విన్నవారికి ఎవరికైనా తాను ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నట్లే కన్పిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును తాను ఒక్కరే సొంతం చేసుకునేలా చంద్రబాబు ప్రయత్నించాల్సి ఉంటుంది. తనకు గత ఎన్నికలలో దూరమయిన సామాజిక వర్గాలను తిరిగి పార్టీ వైపునకు రప్పించుకునేలా చంద్రబాబు శ్రమించాల్సి ఉంటుంది. తన ట్విట్టర్ బయోని మార్చలేదు అంత బ్రాడ్ మైండ్ లేదు.... కానీ చంద్రబాబుకు ఈసారి సాధ్యమవుతుందా? లేదా? అన్నది ప్రశ్న. ఏపీలో వైసీపీ, టీడీపీ రెండూ బలంగానే ఉన్నాయి. అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ ఈసారి జనసేనను కూడా అంత తీసేయాల్సిన పరిస్థితి కాదు. పవన్ ఒంటరిగా పోటీ చేసి కొద్దగొప్పో ఓట్లను చీలిస్తే అది చంద్రబాబు పార్టీకే నష్టం. 2019 ఎన్నికల్లో దాదాపు యాభై నియోజకవర్గాల్లో జనసేన దెబ్బకొట్టింది. ఆ అనుభవాన్ని చంద్రబాబు ఇంకా మర్చిపోలేదు. అలాగని జనసేన కు ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేసే బ్రాడ్ మైండ్ లేదు. ఎన్నికల ఫలితాల తర్వాత ఇక కుదరదు అనుకుంటే తప్ప ఎన్నికలకు ముందు పొత్తు సాధ్యం కాదన్నది వాస్తవం.. మరోవైపు చంద్రబాబు పార్టీకి 175 నియోజకవర్గాల్లో క్యాడర్ ఉంది. నేతలు ఉన్నారు. యాభై శాతం యువకులకు ఇస్తామని ప్రకటించారు. మూడేళ్లు వరసగా ఓటమి పాలయిన వారికి సీట్లు లేవని చెప్పారు. కానీ ఆ మాటలన్నింటినీ ఇక అటక మీద పెట్టాల్సి ఉంటుంది. ఒంటరిగా పోటీ చేసినప్పుడు అలాంటి ప్రయోగాలు చంద్రబాబు చేయడు. అంత ధైర్యమూ లేదు. పాత నేతలే ఆయనకు మళ్లీ అవసరమవుతారు. మరో వైపు 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో బలమైన నేతలు లేరు. ఇందుకు కొంత కసరత్తు చేయాల్సి ఉంటుంది. పవన్ కల్యాణ్ పర్చూరు ప్రసంగం విన్న తర్వాత చంద్రబాబు కూడా ఇక తన ప్రయత్నాల్లో తాను ఉండక తప్పదు. ఒంటరిగా పోటీ చేసేందుకే పార్టీని సిద్ధం చేయాల్సి ఉంటుంది.

## సంక్షోభానికి ఆదిత్య, రశ్మి థాక్రేలే కారణమా...

ముంబై, జూన్ 24, (న్యూస్ పల్స్) ఆదిత్య థాక్రే .. శివసేన యువనేత. ఉద్ధవ్ థాక్రే వారసుడు. ప్రస్తుత ప్రభుత్వం మొత్తం సంక్షోభంలో పడటానికి ఆదిత్య థాక్రే కారణమని చెప్పక తప్పదు. ఆయనతో పాటు ఉద్ధవ్ సతీమణి రశ్మి థాక్రే కూడా శివసేన నిట్టనిలువుగా చీలడానికి ప్రధాన కారణమంటున్నారు. తల్లి,కొడుకుల కారణంగా పార్టీ చీలిపోయి ఇప్పుడు ప్రభుత్వం పతనానికి దారితీసింది. ప్రభుత్వ వ్యవహారాల్లో ఇద్దరూ జోక్యం చేసుకున్న కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు.మాతృశ్రీ నుంచే ఆదేశాలు అధికారులకు చేరుతుంటాయని, శివసేన మంత్రులను, ఎమ్మెల్యేలను పూచిక పుల్లతో సమానంగా వీరు చూడటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. శివసేనలో ఏక్‌నాథ్ షిండే వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగుతున్నారు. బాల్ థాక్రే హయాం నుంచి ఆయనకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గత ఎన్నికల్లో శివసేన, బీజేపీ కలసి పోటీ చేశాయి. అయితే ముఖ్యమంత్రి పదవి కోసం శివసేన పట్టుబట్టింది. దీని వెనక ఆదిత్య, రశ్మి థాక్రే ఉన్నారు. బీజేపీ కాదనడంతో శివసేన కొన్ని దశాబ్దాలుగా వ్యతిరేకిస్తున్న ఎన్సీపీ, కాంగ్రెస్ కు దగ్గరయింది. ఆ రెండు పార్టీల మద్దతుతో ఉద్ధవ్ ముఖ్యమంత్రి కాగలిగారు. తాత సిద్ధాంతాలకు విరుద్ధంగా.... అసలు శివసేన చీఫ్ కుటుంబం నుంచి ఎవరూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగలేదు. బాల్ థాక్రే బతికి ఉన్నంత వరకూ అది జరగలేదు. అధికారం కోసం కాకుండా హిందుత్వ కోసమే ఆయన ఆరాటపడ్డారు. పోరాటం చేశారు. కానీ ఆయన మరణం తర్వాత ఉద్ధవ్ థాక్రే కుటుంబం నుంచి ఆదిత్య థాక్రేను నేరుగా ప్రత్యక్ష్య రాజకీయాల్లోకి దించింది. వర్లి నుంచి పోటీ చేయించింది. ఆయన గెలుపునకు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సాయం కూడా తీసుకుంది. ఇదంతా శివసైనికులకు కొంత ఇబ్బందిగా మారింది. అధికారంలోకి రాగానే మంత్రి పదవి లోకి కూడా ఆదిత్య థాక్రేను తీసుకుంది. ఇది ఎమ్మెల్యేల్లో మరింత బ్యాడ్ అయింది. అయితే ఈ కలయికను తొలి నుంచి శివసేనలో కొందరు వ్యతిరేకిస్తున్నారు. కానీ వ్యతిరేకంగా ఎవరూ గళం విప్పలేకపోయారు. గడచిన రెండు సంవత్సరాల నుంచి ఉద్ధవ్ థాక్రే పరిస్థితి మారిపోయింది. ఆయన ప్రజలకు దూరమయ్యారు. ఎన్సీపీ చేతిలో బందీ అయ్యారన్న విమర్శలున్నాయి. దీనికి కారణం కూడా ఆదిత్య, రశ్మి థాక్రే అన్నది వాస్తవం. ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ఆ రెండు పార్టీల సహకారం అవసరమని భావించి ఎన్సీపీ ఆడించినట్లు థాక్రే కుటుంబం ఆడిందంటున్నారు. శివసేన ఎమ్మెల్యేలను అస్సలు పట్టించుకోలేదు. వారి నియోజకవర్గాల అభివృద్ధి గురించి ఆలోచించలేదు. అందువల్లనే ఇంత పెద్ద స్థాయిలో శివసేన ఎమ్మెల్యేల్లో వ్యతిరేకత వచ్చిందంటున్నారు. ఇక శివసేనలో ముఖ్యనేత ఏక్‌నాథ్ షిండే పట్టణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్నారు. ఆయన శాఖలో కూడా ఆదిత్య వేలు పెట్టారు. ఆయన చెబితేనే అధికారులు జీవోలు విడుదల చేస్తున్నారు. ఇవన్నీ కొంతకాలం నుంచి భరిస్తూ వచ్చిన షిండే అదనుకోసం వెయిట్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కలసి వచ్చాయి. అప్పటికే శివసేన అసంతృప్త ఎమ్మెల్యేలను ఏక్‌నాథ్ షిండే పసిగట్టారు. తనతో నమ్మకంగా వచ్చే వారిని నిర్ధారించుకున్నారు. ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారు. అనంతరం క్యాంప్ నకు బయలుదేరారు. క్యాంప్ నుంచే థాక్రే కుటుంబానికి సవాల్ విసిరారు. సక్సెస్ అయ్యారు. 34 మంది ఎమ్మెల్యేలను తన వెంట పెట్టుకుని వెళ్లడమంటే శివసేన అధినేత కుటుంబంపై ఎంత వ్యతిరేకత ఉందో ఇట్టే అర్థమవుతుంది.


## పశ్చిమ వైసీపీలో దూకుడు



ఏలూరు, జూన్ 24, (న్యూస్ పల్స్) పశ్చిమగోదావరి జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ నెగ్గని రెండు నియోజకవర్గాల్లో ఉండి ఒకటి. ఇక్కడ వైసీపీలో మొదటి నుంచి వర్గపోరు తీవ్రంగానే ఉంది. పార్టీ బలోపేతానికి ఇంఛార్జ్ పదవులు చేపడుతున్న నేతలు.. కేడర్‌ను పట్టించుకోరనే విమర్శలు వినిపిస్తాయి. ఇప్పటికే నియోజకవర్గంలో మూడుసార్లు ఇంఛార్జులను మార్చారు. అయినప్పటికీ పరిస్థితి మొదటికొస్తుంది తప్పితే మార్పు లేదట. గత ఎన్నికల్లో ఓడిన పీవీఎల్ నరసింహరాజును ఆ మధ్య ఇంఛార్జ్ పదవి నుంచి తప్పించారు. తాజాగా మళ్లీ ఆయనకే పగ్గాలు ఇచ్చారు. దీంతో ఉండి వైసీపీలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదంటోంది కేడర్.ఉండి వైసీపీ ఇంఛార్జ్‌గా అప్పట్లో మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఉండేవారు. ఆయన 2014లో ఓడిపోవడంతో.. 2019లో సర్రాజును కాదని.. పీవీఎల్ నరసింహారాజును బరిలో దించింది పార్టీ. ఈ మార్పు వర్కవుట్ కాలేదు. ఉండిలో పార్టీ నేతల మధ్య సమన్వయం లేదని భావించిన వైసీపీ పెద్దలు నరసింహారాజును తప్పించి.. గోకరాజు రామరాజును ఇంఛార్జ్‌గా నియమించారు. ఏమైందో ఏమో.. రామరాజును తప్పించి మళ్లీ నరసింహరాజును తెరపైకి తీసుకొచ్చింది పార్టీ. అసలే గ్రూపుల గోలతో ఇబ్బంది పడుతున్న తరుణంలో పీవీఎల్‌కు మళ్లీ ఎందుకు పగ్గాలు అప్పగించారన్నది కేడర్ ప్రశ్న. ఆయన గ్రూపులను ప్రోత్సహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడూ అదే జరుగుతుందని భయపడుతున్నారట. అసలు ఈ పంచాయితీ మనకెందుకు అని భావిస్తున్న కొందరు నేతలు తాజా పరిణామాలు రుచించక పార్టీ మారే ఆలోచనలో ఉన్నారట.వైసీపీ గ్రామ కమిటీలలో పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా.. తనకు అనుకూలంగా ఉన్నవారికే నరసింహారాజు చోటు కల్పించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కమిటీలపై వైసీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీలకు కూడా సమాచారం లేదట. ఉండిలో వైసీపీ బలోపేతం కోసం మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజుకు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. పీవీఎల్ నరసింహారాజు డీసీసీబీ ఛైర్మన్‌ను చేశారు.నియోజకవర్గంలో గోకరాజు రామరాజు కుటుంబానికి పట్టు ఉంది. ఇంతచేసినా ఉండిలో వైసీపీకి తేడా కొట్టడానికి కారణం సమన్వయ లోపమే అన్నది కేడర్ చెప్పే మాట. పదవుల్లో ఉన్న నేతలు కేడర్‌ను చేరదీయకపోవడం.. కేడర్ విశ్వసించేలా పనులు చేపట్టకపోవడం పెద్దలోటుగా చెబుతున్నారు. ఇప్పుడు పాతరాజుగారే మళ్లీ ఇంఛార్జ్‌గా వచ్చారు. మరి.. గతంలోలా వర్గాలను ప్రోత్సహిస్తారో? లేక అందరినీ కలుపుకొని వెళ్తారో చూడాలి.

## ధర్మవరంపై పరిటాల గురి

అనంతపురం, జూన్ 24, (న్యూస్ పల్స్) పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఎన్నికల్లో రాప్తాడు నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన శ్రీరామ్ ఈసారి ధర్మవరం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేసే అవకాశాలున్నాయి. ధర్మవరంలోనూ పరిటాల కుటుంబానికి కొంత గ్రిప్ ఉండటంతో ఈసారి అక్కడి నుంచి పోటీ చేసి శాసనసభలోకి అడుగు పెట్టాలని శ్రీరామ్ భావిస్తున్నారు. సూరి వెళ్లిపోవడంతో... ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీకి పట్టుంది. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ తరుపున గోనుగుంట్ల సూర్యనారాయణ అలియాస్ వరదాపురం సూరి ధర్మవరం నుంచి గెలిచారు. అయితే 2019లో ఓటమి పాలయిన తర్వాత తనకున్న సమస్యల దృష్ట్యా ఆయన బీజేపీలో చేరారు. దీంతో ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి బాధ్యతలను పరిటాల శ్రీరామ్ కు చంద్రబాబు అప్పగించారు. తొలుత అయిష్టంగానే బాధ్యతలను తీసుకున్న శ్రీరామ్ తర్వాత ధర్మవరం నియోజకవర్గంలో తన పట్టును పెంచుకునే ప్రయత్నం గత కొంతకాలంగా చేస్తున్నారు. తరచూ పర్యటిస్తూ తనకంటూ ప్రత్యేక క్యాడర్ ను ఏర్పాటు చేసుకున్నారు. టీడీపీలోకి సూరి... ప్రస్తుతం బీజేపీలోనే వరదాపురం సూరి కొనసాగుతున్నారు. కానీ ఎన్నికల నాటికి వరదాపురం సూరి తిరిగి టీడీపీలోకి వస్తారన్న ప్రచారాన్ని ఆయన అనుచరులు చేస్తున్నారు. ఇది పరిటాల వర్గానికి మింగుడుపడటం లేదు. దీంతో వరదాపురం సూరిపై నేరుగా మాటల యుద్ధానికి దిగుతున్నారు. సూరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అక్రమాలను పరిటాల వర్గం తరచూ బయటపెడుతూ ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని ఎప్పటికప్పుడు పరిటాల శ్రీరామ్ పార్టీ అధినాయకత్వానికి తెలియజేస్తున్నారు. చంద్రబాబు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పడంతో పరిటాల శ్రీరామ్ కు తనకు ధర్మవరం టిక్కెట్ గ్యారంటీ అని భావిస్తున్నారు. కానీ లాబీయింగ్ చేసి చివరి క్షణంలోనైనా వరదాపురం సూరి పార్టీలో చేరగలరని, లేకుంటే పొత్తులు



కుదిరితే అటువైపు నుంచి సూరి వస్తారని భావించిన పరిటాల శ్రీరామ్ నేరుగా ఆయనపై విమర్శలు చేస్తున్నారు. మొత్తం మీద పరిటాల శ్రీరామ్ ధర్మవరం పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మరి సూరి చివరకు ఎగరేసుకుపోతారా? లేక శ్రీరామ్ కే సీటు దక్కుతుందా? అన్నది చూడాలి. అయితే ఇద్దరి మధ్య విభేదాలు మరోసారి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి అడ్వాంటేజీగా మారే అవకాశాలు లేకపోలేదు.

# సీఎన్జీ బస్సులతో పర్యావరణం




విశాఖపట్టణం, జూన్ 24, (న్యూస్ పల్స్) పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీఎన్జీ బస్సులు నడుపుతూ ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది విశాఖ వ్యాలీ స్కూల్. ఇటీవల పాఠశాల యాజమాన్యం కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్(సీఎన్జీ)తో నడిచే ఆరు బస్సులను కొనుగోలు చేసింది. పాఠశాల విద్యార్థుల కోసం ఈ బస్సులను నడుపుతోంది. కొన్నేళ్లుగా నడుస్తున్న బస్సులు మరమ్మతులకు గురి కావడంతో.. వాటి స్థానంలో డీజిల్‌తో నడిచేవి కాకుండా సీఎన్జీ బస్సులు కొనుగోలు చేసింది.డీజిల్‌తో నడిచే బస్సుల కారణంగా అధిక శాతం నల్లని పొగ బయటకు వస్తుంది. దీని వల్ల పర్యావరణానికి చాలా నష్టం. అదే సీఎన్జీ బస్సులతో నగరానికి కాలుష్య ముప్పు తక్కువ. అందులో భాగంగానే విశాఖ వ్యాలీ పాఠశాల యాజమాన్యం సీఎన్జీ బస్సులను కొనుగోలు చేసి.. ప్రైవేట్ పాఠశాలలకు ఆదర్శంగా నిలిచింది. సాధారణంగా డీజిల్‌తో నడిచే బస్సుల కంటే ఈ బస్సులు ఎక్కువ మైలేజీ ఇస్తాయని డ్రైవర్లు చెబుతున్నారు.డీజిల్ బస్సులు లీటర్‌కు 5 నుంచి 6 కిలోమీటర్లు నడుస్తాయి. అదే సీఎన్జీ బస్సులు ఓ కిలో గ్రాము గ్యాస్‌తో 7 నుంచి 8 కిలోమీటర్ల దూరం నడుస్తాయని చెబుతున్నారు. వీటి వల్ల కార్బన్ డయాక్సైడ్ చాలా తక్కువగా వెలువడుతుంది. వాతావరణం కాలుష్యం కాకుండా తమ వంతు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామని ఇక్కడ యాజమాన్యం చెబుతోంది. ఇటీవల కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీశ ఈ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులను పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పరిశీలిస్తున్నాయి. ఎక్కువ మైలేజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఉపయుక్తంగా ఉండటంతో.. వీటిని నడిపేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఈ బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇద్దరు విద్యార్థులకు ఒక సీటు చొప్పున కేటాయించారు. ప్రతి బస్‌లో 40 మంది విద్యార్థులు ప్రయాణించవచ్చు. ఇందులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ సేఫ్టీ సిద్ధం చేశారు. బస్ వెనుక భాగం కిందన సీఎన్జీ సిలిండర్ల క్యాబిన్ ఉంటుంది.

# కుటుంబం ఆత్మహత్యాయత్నం

## తల్లి ఇద్దరు పిల్లలు మృతి

విజయవాడకృష్ణలంక బాలాజీనగర్‌లో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిననలుగురు ఆత్మహత్యా యత్నం చేసారు. ఇంట్లోనే పురుగుల మందు తాగి పడిపోయినట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆనలుగురిని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. చికిత్స పొందుతూ తల్లి, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అంటున్నారు. సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు. మృతులు..తల్లి లక్ష్మి, పిల్లలు నాగమణికంఠ, జయ హర్ష.

# ఏలూరు జిల్లాలో ఘోరం?

## ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మృతి

ఏలూరు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి లో విద్యుత్ ప్రమాదం జరిగింది. 11 కేవీ విద్యుత్ వైరు తెగి ఇద్దరు యువ రైతులు మృతి చెందారు. దేవులపల్లి గ్రామానికి చెందిన వల్లేపల్లి నాగేంద్ర, వాల్లేపల్లి ఫణీంద్ర విద్యుదాఘాతానికి గురయ్యి మృతి చెందారు. మృతులు ఇద్దరు అన్నదమ్ములు. పుంత రహదారి పై 11 విద్యుత్ వైరు తెగిపడింది. ద్విచక్ర వాహనానికి వైరు తగలడంతో మోటార్ సైకిల్ దగ్ధమయింది. విద్యుత్ ప్రవహించడంతో మంటలు అంటుకోడంతో సంఘటనా స్థలం లోనే నాగేంద్ర, ఫణీంద్ర మృతి చెందారు. వాళ్లిద్దరూ పాలు తీయడానికి పొలం వెళ్తుండగా ఘటన జరిగింది. మృతులు నాగేంద్ర బి.టెక్ చదువుతుండగా తమ్ముడు ఫణీంద్ర ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి అనారోగ్యంతో వుండడంతో తో పాలు తేవడానికి పొలం వెళ్లారు. ఇద్దరు కుమారులు మరణించడంతో మృతుల కుటుంబం విషాదంలో మునిగిపోయింది. నాగేంద్ర, ఫణీంద్ర ల మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు గ్రామస్థులు. లక్కవరం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

# రిమాండ్ ఖైదీ పరారీపట్టివేత

ఏలూరు రిమాండ్ ఖైదీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పరారీ అయ్యాడు. అప్రమత్తమయని పోలీసులు ఖైదీని తిరిగి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా వున్నాయి. ద్వారకాతిరుమల మండలం కొత్తపల్లి లో జరిగిన హత్య కేసులో ముద్దాయి రవితేజ రిమాండ్ లో వున్నాడు. నిందితుడికి అనారోగ్య కారణాలతో న ఏలూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో వైద్య సదుపాయం కొరకు జాయిన్ చేసారు. అతనికి పోలీస్ కాపలా ఏర్పాటు చేసారు. సదరు ముద్దాయి రవి తేజ గురువారం అర్థ రాత్రి హాస్పిటల్ నుండి పారిపోయాడు. అతడిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతనిపై మరో కేసును నమోదు చేసారు. నిందితుడికి కాపలాగా ఉన్న పోలీస్ సిబ్బంది పై ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు మరియు శాఖాపరమైన చర్యలు కొరకు సిఫార్సు చేసినట్లు సమాచారం.

# ఎన్సీసీ క్యాంపులో కరోనా కలకలం

కాకినాడ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఎస్ కె ఆర్ ఉన్నత పాఠశాల లో ఉన్న 40 మంది ఎన్ సి సి స్టూడెంట్స్ లలో కరోనా లక్షణాలు కనిపించడం కలకలం రేపింది. అధికారులు ఆ 40 మందికి కోవిడ్ టెస్ట్ లు చేయించి ఐసోలేషన్ లో ఉంచారు. మొత్తం ఎన్ సి సీ క్యాంపులో 317 మంది విద్యార్థులు వున్నారు. క్యాంపు ఈ నెల ల 18 నుంచి నడుస్తోంది. ఈ 40 మంది విద్యార్థులు రిజల్ట్స్ వచ్చాక ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి క్యాంపు కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

# రాజు గారి పదవీ గండం....



విజయనగరం, జూన్ 24, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు వివాదం ఇప్పట్లో చల్లారేటట్టు కనిపించడం లేదు. కోర్టు నిర్ణయానికి అనుగుణంగా అనువంశిక ధర్మకర్త, చైర్మన్‌గా అశోక్ గజపతిరాజు తిరిగి బాధ్యతలు చేపట్టారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఆహ్వానితులుగా అధికారపార్టీకి అనుకూలమైన వ్యక్తులు నామినేట్ అయ్యారు. పాలకమండలి కూర్పు ప్రభుత్వ నిర్ణయాధికారమే అయినప్పటికీ.. అది కొలువుతీరిన తీరు చర్చగా మారింది. చైర్మన్‌గా అశోక్ గజపతిరాజుకు ఆహ్వానం లేకుండానే అధికారులు కథ నడిపించేశారు. ఈ అంశాన్ని అశోక్ సీరియస్‌గా తీసుకుని న్యాయ సలహా కోరడంతో ట్రస్ట్ బోర్డు సమావేశంలో అధికారులు క్షమాపణ చెప్పారు. అయితే.. అసలు ఉద్దేశాలు వేరే ఉన్నాయని భావిస్తున్నారట అశోక్ గజపతిరాజు.మాన్సాస్ ట్రస్ట్ భూముల వివాదంలోనే గతంలో అశోక్‌ను పదవీచ్యుతుణ్ణి చేసింది వైసీపీ సర్కార్. ఆ ప్లేస్‌లో వచ్చిన సంచయితా గజపతిరాజు తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. అశోకే అనువంశిక ధర్మకర్తగా కోర్టు తేల్చడంతో సంచయిత కనిపించకుండా పోయారు. ఇక వివాదాలకు తావులేదని.. అంతా సింహాద్రి అప్పన్న సేవలో భాగం అవుతారని భావించారు. అయితే చట్టానికి వ్యతిరేకంగా వెళ్తే ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి నుంచి తనను తొలగించాలని ప్రభుత్వం ఎదురు చూస్తోందని అశోక్ చేసిన కామెంట్స్ చర్చగా మారాయి. లోగుట్టు ఆరా తీసే పనిలో పడ్డారు కొందరు.సింహాచలం దేవస్థానంలో పంచగ్రామాల భూ సమస్య జఠిలమైన వివాదం. సుదీర్ఘ కాలంగా న్యాయపోరాటం జరుగుతోంది. భీమిలి, పెందుర్తి, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలతో ముడిపడి వున్న ఈ సమస్యను పరిష్కరిస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ హామీ ఇచ్చింది. ఆ దిశగా కసరత్తు చేసినా పీఠముడులు వీడలేదు. పంచగ్రామాల పరిధిలో వేల మంది జీవిస్తుండగా.. దేవస్థానం ఆంక్షలు కారణంగా అక్కడ ఇళ్లకు మరమ్మతులు లేవు. ఆ భూములు దేవస్థానం ఆస్తో.. తమ సొంతమో తేలక రైతులు నరకం అనుభవిస్తున్నారు. ఈ తరుణంలో పంచగ్రామాల్లో భూములను అనుభవదారులకు రెగ్యులరైజ్ చేసి.. ఆ మేరకు భూమిని ప్రత్యామ్నాయంగా దేవస్థానానికి కేటాయించాలనే ప్రతిపాదన ఉంది. ఐతే, భూమికి భూమి బదలాయించడం వల్ల ఆలయానికి నష్టం వస్తుందనేది కొందరి వాదన. ప్రస్తుతం పంచగ్రామాల పరిధిలో గజం విలువ 20 వేల పైమాటే. అదే మార్కెట్ విలువ ఆధారంగా సింహాద్రి అప్పన్నకు భూముల కేటాయింపు జరగాలనేది ప్రతిపాదన. ఇది అమలు కావాలంటే ప్రభుత్వం సుమారు వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పైగా ఎండోమెంట్ యాక్ట్ ఎంత వరకు సహకరిస్తుందో కూడా చూడాలనేది నిపుణుల మాట.పంచగ్రామాల అంశంలో ముందడుగు పడాలంటే ఛైర్మన్ అశోక్ గజపతిరాజు నిర్ణయం కీలకం. ప్రభుత్వానికి ఆ విషయం తెలుసు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ధర్మకర్తల మండలి తీసుకోలేదన్నది అశోక్ మాట. అందుకే రిస్క్ తీసుకోలేనని ఆయన చెప్పేశారు. సభ్యుల ప్రతిపాదన పంపితే న్యాయపరమైన సలహాలు తీసుకుని.. చట్టబద్ధంగా ఉంటే ఆమోదించడానికి అభ్యంతరం లేదని ట్రస్ట్‌బోర్డుపై భారం పెట్టేసి చేతులు దులుపుకున్నారు. అయితే ట్రస్టుబోర్డు సభ్యులను తీర్మానం చేయాలని చెబుతూనే.. తనను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని.. అశోక్ చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఐతే, అశోక్ మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదంటున్నారు ట్రస్ట్ బోర్డు సభ్యులు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని.. ప్రభుత్వ ఆలోచనలను, వ్యూహాలను పసిగట్టడంలో ఇప్పుడు అశోక్ గజపతిరాజు రెండు అడుగులు ముందే ఉన్నారట. వారసత్వం వివాదంలో సంచయిత తెరమరుగైన తర్వాత అందరి దృష్టీ ఆనంద గజపతిరాజు చిన్న కుమార్తె ఊర్మిళ గజపతిపైనే ఉంది. ట్రస్ట్ బోర్డు సమస్య వచ్చాక తమ అస్తిత్వం కాపాడుకోవడానికి ఆనంద్ కుటుంబం ప్రయత్నించింది. పూసపాటి సంస్థానంలో తమ వారసత్వ హక్కులను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ తరుణంలోనే ఇటీవల ఆసక్తికరమైన సీన్ కనిపించింది. కొన్నేళ్లుగా ఎవరికి వారుగా సింహాచలం చందనోత్సవం రోజు స్వామివారి దర్శనానికి వస్తున్న అశోక్, ఆనంద్ కుంటుబాలు ఈ ఏడాది కలిసి వచ్చాయి. దీంతో ప్రభుత్వం మరోసారి పదవీ గండం తీసుకుని వస్తే ధీటుగా ఎదుర్కోవడానికి అశోక్ గజపతిరాజు పూర్తి సన్నద్ధంగా ఉన్నారని అనుకుంటున్నారట. మరి.. రాజకీయ వైకుంఠ పాళీలో ఎవరు పైచెయ్యి సాధిస్తారో చూడాలి.

# మిర్చి...మూడు నెలల్లో రూ.4,500 పెరుగుదల



గుంటూరు, జూన్ 24, (న్యూస్ పల్స్) ఎండు మిర్చి ధర రోజు రోజుకూ పెరుగుతోంది. మార్కెటింగ్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో దళారుల ప్రమేయం తగ్గి, వాస్తవ ధరలు రైతులకు అందుతున్నాయి. చీడపీడల కారణంగా ఏడాది పంట దిగుబడులు తగ్గినా.. ధరలు పెరుగుతుండటం రైతన్నలకు ఊరటనిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా 341 మిర్చి రకం ధర ఏకంగా క్వింటాల్ రూ.26 వేలకు చేరింది. దీంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన ఎండు మిర్చిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎగబడుతున్నారు. మిర్చి పైరుకు గత ఏడాది తెగుళ్లు సోకడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఇదే సందర్భంలో ఎగుమతులు పెరిగాయి. బంగ్లాదేశ్ వంటి దేశాలకు సైతం ఎగుమతి కావడం, దేశీయంగా డిమాండ్ పెరగడంతో ధరలు ఎగబాకుతున్నాయి. దీంతోపాటు నాణ్యమైన సరుకు లభ్యత తక్కువ ఉండటం ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశాలకు ఎగుమతి అయ్యే తేజ, బాడిగ రకాల మిర్చికి గతంలో అధిక ధర ఉండేది. అందుకు భిన్నంగా ప్రస్తుతం 341 రకం మిర్చికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా ఈ రకం మిర్చి ధర కనీవినీ ఎరుగని రీతిలో ఎగబాకుతోంది. మార్చి నెలలో 341 మిర్చి క్వింటాల్ రూ.21,500 ధర పలికి రికార్డు సృష్టించింది. ఈ ధర క్రమంగా పెరుగుతూ.. ప్రస్తుతం రూ.26 వేలకు చేరింది. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుంటూరు, నడికుడి, ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో నాణ్యత గల అన్ని రకాల మిర్చి ధరలు పెరుగుతున్నాయి. క్వింటాల్‌కు సగటున రూ.20 వేలకు పైగా పలుకుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చిని సైతం కొనేందుకు వ్యాపారులు ఎగబడటంతో సందడి నెలకొంది. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, కర్నూలు, తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో 341 రకం మిర్చిని సాగు చేస్తారు. చిక్కటి ఎర్ర రంగు కలిగి ఉండే ఈ రకాన్ని కారం తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దేశీయంగా పచ్చళ్ల తయారీతోపాటు, గృహావసరాలకు వాడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఉత్తర భారతదేశంలో ఈ రకానికి మంచి డిమాండ్ ఉంది. కొత్త పంట నవంబర్ వరకు వచ్చే అవకాశం లేకపోవడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి

# గెట్ టూ గెదర్ పేరుతో క్యాసినో

విజయవాడ, జూన్ 24, ఏపీలో మరోసారి క్యాసినో పాలిటిక్స్ బహిర్గతం అయ్యాయి. గతంలో గుడివాడలో క్యాసినో నిర్వహించారని టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాజాగా కృష్ణా జిల్లాలో మరోసారి క్యాసినో కలకలం రేగింది. ఓ గోవా కంపెనీ గెట్ టుగెదర్ పేరుతో పార్టీ నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. కాక్‌టైల్ డిన్నర్, సినీ హీరోయిన్‌ల స్టెప్పులు, సింగర్ల పాటలు, మధురమైన అనుభూతి ఉంటుందని నిర్వాహకులు ప్రచారం చేశారు. దీని కోసం ఆకర్షణీయమైన ఆహ్వాన పత్రాలను పంపారు. భారీ ఏర్పాట్లతో హోరెత్తించారు. కానీ కథ మొత్తం అడ్డం తిరిగింది.పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు వేదికగా ఆయానా కన్వెన్షన్ సెంటర్‌లో గోవా మెజిస్టిక్ సంస్థ క్యాసినో ఆడించేందుకు సర్వం సిద్ధం చేసింది. మంగళవారం రాత్రి క్యాసినో నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. సంపన్నులు, ప్రముఖులు, కొందరు నేతలకు ఈ ఈవెంట్‌కు సంబంధించి ఆహ్వాన పత్రికలు అందాయి. ఓ ఈవెంట్ పేరుతో గోవా నుంచి అమ్మాయిలు, సినిమా హీరోయిన్‌లు, సింగర్లు వస్తున్నారని నిర్వాహకులు ఊదరగొట్టారు. సినీ తారలకు భారీగానే అడ్వాన్సులు చెల్లించారు. కన్వెన్షన్ సెంటర్‌కు క్యాసినో పేరుతో అడ్వాన్సులు చెల్లించారు. ఎంట్రీ ఫీజు రూ.20వేలు వరకు పెట్టినట్లు తెలుస్తోంది. హైటెక్ పార్టీ పేరుతో రెండు రోజుల పాటు ఏర్పాట్లు చేస్తూ యూత్‌లో జోష్ పెంచారు. గెట్ టుగెదర్ పార్టీ తరహాలో ఈవెంట్ ఉంటుందని కంకిపాడు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మద్యం సరఫరాకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. దీంతో గెట్ టుగెదర్ పార్టీనే కదా అని పోలీసులు కూడా అనుమతి ఇచ్చేశారు.

# టీఆర్ఎస్ లో తిరుగుబాటు వస్తే పరిస్థితి ఏంటి?



హైదరాబాద్, జూన్ 24, (న్యూస్ పల్స్) మహారాష్ట్రలోని ఉద్ధవ్ ఠాక్రే సర్కార్ పై సొంత పార్టీ నేతల తిరుగుబాటు తీవ్ర దుమారం రేపుతోంది. దాదాపురెండున్నరేళ్ల పాటు కొనసాగిన సంకీర్ణ ప్రభుత్వానికి బీటలు వారాయి. ఏ క్షణంలోనైనా ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం కుప్పకూలుతుందనే వార్తలతో దేశ ఆర్థిక రాజధానిలో అసలేం జరుగుతోందనే దానిపై మిగతా రాష్ట్రాలు ఫోకస్ పెట్టాయి. ఉద్ధవ్ ఠాక్రే సర్కార్ పై అసమ్మతి రాగం ఆలపిస్తున్న సొంత పార్టీకి చెందిన మంత్రి ఏక్ నాథ్ షిండే వర్గానికి క్రమంగా మద్దతు పెరగడం సంచలనం అవుతోంది. తాము తిరుగుబాటు ఎందుకు చేయాల్సి వచ్చిందనే విషయాన్ని గురువారం ఏక్ నాథ్ షిండే స్పష్టం చేశారు. ఉద్ధవ్ ఠాక్రే తీరును ఎండగడుతూ ఏకంగా మూడు పేజీల లేఖ రాశారు. ఏక్ నాథ్ షిండే ఏ కారణాలను అయితే ప్రస్తావించారో.. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కూడా అలాంటి విమర్శలే రావడం మరింత ఆసక్తిని రేపుతోంది. దీంతో ఏక్ నాథ్ షిండే తరహాలో సీఎం కేసీఆర్ పై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తే పరిస్థితి ఏంటన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ను ఉద్దేశించి తిరుగుబాటు దారులకు నేతృత్వం వహిస్తున్న ఏక్ నాథ్ షిండే ఓ లేఖను రాశారు. ఇందులో సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఎమ్మెల్యేలకు సైతం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. సొంత ఎమ్మెల్యేలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని విమర్శలు గుప్పించారు. అపాయింట్ మెంట్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇన్నాళ్లూ తెరుచుకోని సీఎం ఇంటి తలుపులు తాము నిరసన గళం విప్పగానే తెరుచుకున్నాయని ఎద్దేవా చేశారు. కొంతమందిని పక్కన పెట్టుకుని అనైతికమైన రాజకీయం నడుపుతున్నారని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు ఏక్ నాథ్ షిండే. ఈ మాటలే ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో రచ్చ రేపుతున్నాయి. సీఎం కేసీఆర్ విషయంలోనూ ఇదే తరహా విమర్శలు వస్తున్నాయి. గతంలో ఈటల రాజేందర్ పార్టీకి రాజీనామా చేసిన సమయంలో ఏక్ నాథ్ షిండే ఎలాంటి మాటలైతే ప్రస్తావించారో ..అలాంటి కామెంట్సే చేశారు.సీఎం కేసీఆర్ సొంత మంత్రులకు గౌరవం ఇవ్వడం లేదని, కనీసం మంత్రులుగా కాకపోయినా మనుష్యులుగానైనా చూడాలని తాము కోరుకున్నామని చెప్పారు. అనేకమంది ఎమ్మెల్యేలు, మంత్రులు కేసీఆర్ విషయంలో అసంతృప్తితో రగిలిపోతున్నారని, తాను బయటకు వచ్చి మాట్లాడుతున్నానన్నారు. మిగతా వారు అక్కడే ఉండి మౌనంగా ఉండిపోయారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ వద్ద ఆత్మగౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు అయితే సీఎం కేసీఆర్ ను ఏకంగా ప్రగతి భవన్, ఫామ్ హౌస్ సీఎం అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలకే సీఎం కేసీఆర్ అందుబాటులో ఉండటం లేదని, ఇక ప్రజల సమస్యలను ఏం వింటారని దెబ్బిపొడుస్తున్నాయి. సామాన్యులకు ప్రగతి భవన్ తలుపులు తెరుచుకోవడం లేదని ఆరోపిస్తున్నాయి.ఏ పార్టీలో అయినా, ప్రభుత్వంలో అయినా తిరుగుబాటు వస్తే దాన్ని కంట్రోల్ చేయడం అంత సులువైన పని కాదు. తాజాగా మహారాష్ట్రలోనూ అదే జరుగుతోంది. తొలుత 11 మంది ఎమ్మెల్యేలే షిండే వైపు ఉన్నారనే వార్తలు వచ్చాయి. కానీ అసమ్మతి వర్గానికి రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ప్రస్తుతం 40 మంది ఎమ్మెల్యేలు ఏక్ నాథ్ షిండే పక్షంలో చేరిపోయినట్లు తెలుస్తోంది. తెలంగాణలోనూ సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇదుగో చేస్తాం అదిగో చేస్తామని సీఎం చేస్తున్న ప్రకటనలపై అంతర్గతంగా సొంత పార్టీ ఎమ్మెల్యేల్లో తీవ్ర నిరాశ నెలకొందట. 2014లో ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనేక మంది టీఆర్ఎస్ ను వీడారు. ఉద్యమంలో కేసీఆర్ తో కలిసి పని చేసిన వారంతా ఆయనపై మండిపడుతున్నారు. పైకి ఎవరూ చెప్పకపోయినా కేసీఆర్ చేస్తున్న అసంబద్ధమైన ప్రకటనలు తమ రాజకీయ భవిష్యత్ ను నిలువునా పాతరేస్తాయనే అభిప్రాయం మెజార్టీ ఎమ్మెల్యేల్లో నెలకొందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఇప్పటికే పార్టీలో కేసీఆర్ వర్గం, కేటీఆర్ వర్గంతో పాటు ఉద్యమకారులు, వలుసదారులు అనే ట్యాగ్ లైన్లు కండువాతో పాటు నేతల మెడల్లో వేళాడుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ సొంత పార్టీ నేతలకు మరింత అందుబాటులో ఉండాలనే టాక్ వినిపిస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం అందుబాటులో ఉండకుంటే మహారాష్ట్రలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలే తెలంగాణలోనూ ఆవిష్కృతమయ్యే అవకాశాలు ఉంటాయనే మాట రాజకీయ పండితుల నుండి వినిపిస్తోంది.

# మున్సిపల్ కమిషనర్ పైన దాడి బాధాకరం : ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి మున్సిపల్ కమిషనర్ పై దాడి బాధాకరమని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యక్తి పైన దాడి చేయడం సమర్ధ నీయం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. రాయచోటి పట్టణంలో లే అవుట్ల విషయంలో గత ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో పట్టణంలోని వీధులన్నీ అస్తవ్యస్తమయ్యాయని, ఆరు అడుగులు, పది అడుగుల రోడ్లు ఏర్పాటు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లే అవుట్ల నిబంధనలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించకపోవడం కొన్ని సనస్యలుకు తావిస్తోందన్నారు. పాత లే అవుట్లను ఏమి చేయలేము కాబట్టి యధాతధంగా, ఎల్ ఆర్ ఎస్ లేకుండానే అనుమతులు ఇస్తున్నారని, నూతనంగా వేసే లే అవుట్ల కు ఖచ్చితంగా నిబంధనలు పెట్టడం మంచిదేనన్నారు. గత సంవత్సరాల క్రితం వేసిన కొన్ని లే అవుట్లలో దాదాపు ఇళ్లన్నీ పూర్తయి, మిగిలిన స్థలాలకు మొత్తం లే అవుట్లను తీసుకురండని అధికారులు చెప్పడంతో ఒకటి రెండు మిగిలిన స్థలాలకు మొత్తం లే అవుట్ కు మాకు ఏమి సంబంధమనే భావన ప్రజల్లో ఉందన్నారు. అటువంటి వాటికి కొన్ని నిబంధనలను ప్రభుత్వపరంగా సడలిస్తే బాగుంటుందన్నారు. త్వరలో జగనన్న భూహక్కు సర్వే చేస్తున్నారని, అందులో మనకు అప్రూవల్ లే అవుట్లు ఉండి, సరైన రికార్డులు ఉంటేనే ప్రజలకు మంచి జరుగుతుందని, లేకపోతే ఎన్నేళ్ళు అయినా దానికి శాశ్విత పరిష్కారం జరగదన్నారు. 2019లో ఏర్పాటైన లే అవుట్ లలో 14 శాతం కట్టించుకుని అప్రూవల్స్ ఇవ్వాలని, అవి కూడా ఇవ్వక పోవడంలో సామాన్యులలో అసహనం పెరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు ఇందు విషయంపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లే అవుట్ ఏర్పాట్ల పై అధికారులు రియల్టర్లకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఆయన అధికారులుకు సూచించారు. ఇబ్బందులు, సమస్యలు ఎదురైనప్పుడు పెద్దలు,



అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలే తప్ప ఇలా అధికారులపై దాడులకు పాల్పకూడదని శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు



శ్రీశైలం( విభారె) శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికీ శుక్రవారం రోజు ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారి సేవగా)ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మ వారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగా గల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. ఈ ప్రకృతి అంతాఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆరవాఙ్మయం చెబుతోంది. దైవశక్తి సమాజంలో ఏదో కొన్ని వర్గాలకు పరిమితం కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉందని తెలియజెప్పే మన విశిష్ట సంస్కృతి యొక్క ఉదాత్త వైఖరికి తార్కాణంగా ఈ గ్రామదేవత ఆరాధనను పేర్కొనవచ్చు. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి. డమరుకంతో చుట్టబడిన ఉండగా, ఎడనువైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిదోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం విశేష అభిషేకం అర్చన నిర్వహించబడ్డాయి.

# దుల్హాన్ పథకానికి దూరం చేసిన వైసీపీ ప్రభుత్వం

**లక్ష ఇస్తామన్నారు చివరికి చేతులెత్తేశారు**

**టిడిపితోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు సాధ్యం**

**తెలుగుదేశం సినియర్ నాయకులు ఉలిగయ్య**



కౌతాళం ( విభారె) ఎన్నికల ముందు ముస్లింల కు ఇచ్చిన హామీలు ఇస్లామిక్ బ్యాంకు వైఎస్సార్ దుల్హాన్ పథకం 50 వేల నుండి లక్ష రూపాయల ఇస్తానన్న హామీలు నవరత్నాలు పేరుతో ఇస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నయవంచనకు పాల్పడుతున్నారని తెలుగుదేశం సినియర్ నాయకులు ఉలిగయ్య, మైనార్టీ జిల్లా కార్యదర్శి రహమాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు అయన పత్రిక విలేకరుల సమక్షంలో తెలియచేస్తూ నిరుపేదల పెళ్లి ఖర్చుకు కష్టమవుతున్న ముస్లిం మైనార్టీ వర్గాల్లోని నిరుపేద యువతులకు దుల్హాన్ పథకం కింద ఆదుకుంటామన్న ప్రభుత్వం ప్రస్తుతనీ ఆర్థిక సంవత్సరానికి సంబందించి ఇంతవరకు నిధులు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు.. రోజురోజుకు పెళ్లి చేసుకున్న యువతుల పేర్ల సంఖ్య నమోదు పెరిగిపోతున్నా..వారికి అందించాల్సిన కానుక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో ఈ పథకం అమలు చేయలేకపోయినట్లు హైకోర్టు కు నివేదికలో పేర్కొంది. పేద ముస్లిం మైనార్టీ యువతులకు పెళ్లి సందర్భంగా ఈ పథకం ద్వారా గత టిడిపి ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించేది. ఈ పథకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు కాగా హైకోర్టు విచారణ సందర్భంగా ప్రభుత్వం ఈ మేరకు వివరణ ఇవ్వడం చాలా సిగ్గు చేటు అన్నారు. సుమారు కొన్ని నెలలుగా పేద ముస్లిం మైనార్టీ కొత్త జంటలకు నిరీక్షణ తప్ప...నిధులు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అది చేస్తున్నాం.. ..ఇది చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నా వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి దుల్హాన్ పథకం ద్వారా రూ.50 వేలు అందించే దీనిని చంద్రన్న పెళ్లికానుకలో విలీనం చేశారు. ఇకనుంచి ముస్లిం మైనార్టీలు కూడా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేయాల్సి ఉంటుందని చెప్పి ఆన్‌లైన్ నందు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పేద ముస్లిం మైనార్టీ యువతులు దరఖాస్తులు చేసుకున్నా చివరికి వారిని నిరాశే మిగిలింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 50వేల రూపాయలు అందించారు. అది తెలుగుదేశం పార్టీకి ఉన్న చిత్తశుద్ధి... కానీ వైసీపీ మాత్రం దుల్హాన్ పథకం కింద లక్ష రూపాయలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ముస్లీం, మైనారిటీల ఓట్లు వేయించుకుని తీరా అధికారంలోకి వచ్చాక వైయస్ జగన్ సర్కార్ చేతులెత్తేసింది. దీంతో రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు వైకాపా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు.అంతరం రౌడూర్ గ్రామంలోని రంజాన్ సాబ్ కుమారుడు వివాహవేడుకల్లో పాల్గొన్న తెలుగుదేశం సీనియర్ నాయకులు ఉలిగయ్య,జిల్లా మైనార్టీ కార్యదర్శి రెహమాన్,సర్పంచ్ లంకే గోవిందు, రోహిత్,పరాకాష్, తిక్కయ్య, బసవరాజు, బుడుదొడ్డి, చిన్న మల్లయ్య పాల్గొన్నారు.

## 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి:జిల్లా ఎస్ పి



కౌతాళం ( విభారె) ::గ్రామంలో ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు.కమవరం గ్రామంలో పల్లె నిద్ర లో పాల్గొన్నారు.ఫాక్షన్ ప్రభావితమైన కామవరం గ్రామంలో పోలీసు పికెట్ ను తనిఖీ చేసిన ?. జిల్లా ఎస్పీ శ్రీ సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్ గారుపల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీ సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్ గారు కౌతాళం మండలం, కామవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్ ను తెల్లవారుజామున తనిఖీ చేశారు.వారు మాట్లాడుతూ పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది గ్రామంలో 24 లీ 7 అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో పెట్రోలింగ్ చేస్తూ ఏలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం మంత్రాలయం నుండి వచ్చిన దళిత సంఘం వారు ఆదోని సబ్ డివిజన్ పరిధిలోని ఉన్న దళితుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ గారికి వినతి పత్రి అందజేశారు. జిల్లా ఎస్పీ గారి వెంట ఆదోని డిఎస్పీ కె.ఎస్ వినోద్ కుమార్ , స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ , ఆదోని తాలుకా ఇన్ స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, ఫ్యాక్షన్ జోన్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, కౌతాళం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి ఉన్నారు.జిల్లా పోలీసు కార్యాలయం ? కర్నూలు

**నేడు వైఎస్సార్ ప్లీనరీ నిర్వహణ మండల పార్టీ అధ్యక్షుడు గాసి**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు (అరకులోయ ఉదయం న్యూస్)రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ అరకు గోష్ఠి లో నిర్వహణకు అరకు స్థానిక ఎమ్మెల్యే పాల్గునా అధ్వర్యంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన మండల పార్టీ అధ్యక్షుడు కొర్రగాసి తెలిపారు ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిదులుగా అరకు పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పాడేరు అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి హాజరు కానున్నారు నియోజకవర్గం లో జడ్పీటిసి ఎంపిటిసిలు వైస్ ఎంపిపిలు సర్పంచ్ లు పార్టీ అనుబంధ చైర్మన్లు డైరెక్టర్ లు కార్యకర్తలు అభిమానులు ప్లీనరీ పాల్గొని విజవంతం చేయగలరు

# డిఎస్ సి1998 అభ్యర్థులకు పెన్షన్ అమలు చేయాలి



కడప అర్బన్ ( విభారె) జూన్ 24: క్వాలిఫైడ్ డీఎస్సీ 1998 అభ్యర్థులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాస రావు ప్రభుత్వాన్ని కోరారు.గత 24 సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న 98 డి ఎస్సీ అభ్యర్థులకు కేవలం 33 వేలు జీతం ఇస్తామనడం సరికాదన్నారు.సంవత్సరానికి కేవలం పది నెలలు మాత్రమే జీతం ఇస్తామనడం అనైతిక మన్నారు.మిగిలిన రెండు నెలలు వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారో ప్రభుత్వం తెలపాలన్నారు.98 లో ప్రభుత్వం తప్పిదం వల్లే వారికి అప్పుడు ఉద్యోగాలు రాలేదన్నారు.ప్రభుత్వ తప్పిదానికి క్వాలిఫైడ్ లకు శిక్ష ఏంటి అని ప్రశ్నించారు.ఇప్పుడు కంటి తుడుపు చర్యగా కేవలం 33 వేల తో ఉద్యోగం ఇస్తామనడం, 'పోమ్మన కుండా పొగ పెట్టినట్టు' ఉందన్నారు. కేవలం సంవత్సరంలో రిటైర్ అయ్యే వారు కూడా వీరిలో ఉన్నారు అన్నారు.కాబట్టి పెన్షన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.క్వాలిఫైడ్ లు బిక్ష అడగడం లేదని, వారికి రావలసిన హక్కు కోసమే కోర్టును ఆశ్రయించారు అన్నారు.98 ల సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జటిలం చేయకుండా పరిష్కరించాలని కోరారు

# రామారావు డ్యూటీ ఎక్కే టైమొచ్చింది..!

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న స్పెషల్ యాక్షన్ థ్రిల్లర్ "రామారావ్ ఆన్ డ్యూటీ". ఈ సినిమాతో శరత్ మండవ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇంతలో ఈరోజు బుధవారం మూవీ విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు.'రామారావ్ ఆన్ డ్యూటీ' చిత్రాన్ని జూలై 29న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన ఓ అనౌన్స్ మెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. నిజానికి ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. పలుమార్లు వాయిదా పడింది.చివరగా రవితేజ చిత్రాన్ని జూన్ 17న విడుదల చేయాలని అనుకున్నారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా పోస్ట్ పోన్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఫైనల్ గా 'రామారావ్ ఆన్ డ్యూటీ' మూవీని జూలై 29న థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించారు.విడుదలకు ఇంకా ఐదు వారాల సమయం ఉండగా.. రాబోయే రోజుల్లో దూకుడుగా ప్రమోషన్స్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాలో రవితేజ ప్రభుత్వ అధికారిగా కనిపించనున్నారు.రవితేజ సరసన దివ్యాంశ కౌశిక్ - రజిషా విజయన్ వంటి ఇద్దరు హీరోయిన్లు నటించారు. వేణు తొట్టెంపూడి చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాతో రీఎంట్రీ ఇస్తున్నారు. నాజర్ - సీనియర్ నరేష్ - పవిత్ర లోకేష్ - 'సర్పట్ట' జాన్ విజయ్ - చైతన్య కృష్ణ - తనికెళ్ల భరణి - రాహుల్ రామకృష్ణ - ఈరోజుల్లో శ్రీ తదితరులు ఇతర పాత్రలు పోషించారు.శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ మరియు ఖీ టీమ్ వర్క్స్ బ్యానర్లపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తున్నారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ అందించగా.. సాహి సురేష్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




# రష్మిక మరో జాక్ పాట్.. ఈసారి ఏకంగా భాయ్ తో!


అదృష్టం అంటే రష్మికదే. ఛలో సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. ఐదేళ్ల క్రితం వన్ ఫిలిం కిడ్. కానీ ఇప్పుడు సూపర్ స్టార్. స్టారాధిస్టార్లకు ఉన్న బెటర్ ఆప్షన్. అంతగా ఐదేళ్లలోనే ఈ భామ ఎదిగేసింది. ఇండస్ట్రీ నుంచి రూ.3కోట్లు డిమాండ్ చేస్తున్న క్రేజీ నాయికగానూ రష్మిక పేరు మార్మోగుతోంది. ఏడాదికి 10కోట్ల వార్షికాదాయం సునాయాసంగా సంపాదిస్తూ ఇతర నాయికలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.ఇటు సౌత్ అగ్ర హీరోలందరి సరసనా నటించేస్తున్న రష్మిక పుష్ప చిత్రంతో పాన్ ఇండియా నాయికగా ఎదిగింది. తదుపరి పుష్ప 2తో మరో లెవల్ కి చేరిపోతుందనడంలో సందేహం లేదు. మరోవైపు బాలీవుడ్ కెరీర్ కూడా ఆషామాషీగా లేదు. ఆరంభమే బిగ్ బి అమితాబ్ లాంటి స్టార్ తో కలిసి క్రేజీ చిత్రంలో నటించేస్తోంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రా లాంటి ఎనర్జిటిక్ స్టార్ సరసన దేశభక్తి చిత్రంలో యాక్షన్ రోల్ ని పోషిస్తోందంటే అర్థం చేసుకోవాలి. ఇంతలోనే రణబీర్ కపూర్ లాంటి క్రేజీ స్టార్ సరసన యానిమల్ చిత్రంలో అవకాశం ఛేజిక్కించుకుంది. ప్రస్తుతం ముంబైలోనే కాపురం పెట్టిన రష్మికకు అవకాశాలు ఒక రేంజులో ఉన్నాయి.ఇంతలోనే మరో జాక్ పాట్ పట్టిందన్న వార్త ఇప్పుడు టాలీవుడ్ ని హీటెక్కిస్తోంది. ఈ భామ తన కెరీర్ లో తొలిసారిగా ఖాన్ సరసన ఆఫర్ దక్కించుకుంది. అది కూడా సల్మాన్ భాయ్ సరసన క్రేజీ సినిమాలో నటించనుందని కథనాలొస్తున్నాయి.సల్మాన్ ఖాన్ మూవీ 'నో ఎంట్రీ 2' లో 10 మంది హీరోయిన్లు ఉంటారని ఇంతకుముందే కథనాలొచ్చాయి. దక్షిణ భారత దేశంలోని క్రేజీ హీరోయిన్స్ పైనా సల్మాన్ భాయ్ కన్నేసారని గుసగుస వినిపిస్తోంది. టైగర్ 3 తర్వాత నో ఎంట్రీ 2 సెట్స్ కి వెళుతుంది. హిట్ మూవీ సీక్వెల్ లో అనిల్ కపూర్ - ఫర్దీన్ ఖాన్ లు కూడా నటిస్తారు. ఆసక్తికరంగా నో ఎంట్రీ 2లో సల్మాన్ సహా హీరోలంతా త్రిపాత్రల్లో కనిపించడం పెద్ద ట్విస్ట్.దీంతో ఏకంగా పది మంది నాయికలు అవసరమని ఇంతకుముందే కథనాలొచ్చాయి. ఇక ఇటీవల దక్షిణ భారత అగ్ర నటీమణుల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రష్మిక మందన్న సహా సమంతా రూత్ ప్రభు.. పూజా హెగ్డే ..తమన్నా భాటియా లాంటి టాప్ హీరోయిన్లను 'నో ఎంట్రీ 2'కి ఎంపిక చేయనున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పాన్ ఇండియా అప్పీల్ ని తేవడం కోసం భాయ్ తెలివిగా ఇలా ప్లాన్ చేస్తున్నారని కూడా టాక్ వినిపిస్తోంది.పుష్ప ఘనవిజయంతో రష్మిక మందన్న బాలీవుడ్ లో పాపులర్ ఫేస్ గా మారింది. ఈ చిత్రంలో శ్రీవల్లిగా నటించి గుండెల్ని కొల్లగొట్టింది. ఇప్పుడు ఆమె సిద్ధార్థ్ మల్హోత్రా 'మిషన్ మజ్ను'తో బాలీవుడ్ లోకి అడుగుపెట్టనుంది. ది ఫ్యామిలీ మ్యాన్ 2లో తన నటనతో అందరినీ ఆకర్షించిన సమంత రూత్ ప్రభు దేశవ్యాప్తంగా పాపులరైంది. పూజా హెగ్డే -తమన్నా బాలీవుడ్ లో బాగా తెలిసిన ముఖాలు.. అందుకే సల్మాన్ ఖాన్ సదరు భామల పేర్లను పరిశీలిస్తున్నారని తెలిసింది. అయితే ఇందులో ఫ్రెష్ ట్యాలెంట్ రష్మిక మందనకు ఛాన్స్ ఆల్మోస్ట్ ఖాయమైనట్టేనన్న గుసగుసా వేడెక్కిస్తోంది.



# భారత క్రికెట్ చరిత్రలో మరుపురాని జ్ఞాపకం

**-1983లో క్రికెట్ వరల్డ్ కప్ గెలిచిన భారత్**

**-తొలి ప్రపంచకప్ సాధించి నేటికి 39 ఏళ్లు**



జూన్ 25, 1983.. భారత క్రికెట్ చరిత్రలో ఈ తేదీ ఒక సంచలనం. భారత క్రికెట్ అభిమానులకు ఒక మరుపురాని జ్ఞాపకం. సరిగ్గా ఇదే తేదీన 39 ఏళ్ల కిందట కపిల్ దేవ్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు లార్డ్స్ మైదానంలో ఒక అద్భుతాన్ని ఆవిష్కరించింది. అభేద్యమైన వెస్టిండీస్ జట్టును ఫైనల్‌లో మట్టికరిపించి.. ప్రపంచకప్‌ను ఒడిసిపట్టింది. మొట్టమొదటి విశ్వ క్రికెట్ కిరీటాన్ని స్వదేశానికి సగర్వంగా తీసుకొచ్చింది. 39 వసంతాల కిందటి ఈ అద్భుత విజయమే.. భారత క్రికెట్‌ను సమూలంగా మార్చివేసిందని చెప్పవచ్చు. ఈ ప్రపంచకప్ విజయం ప్రపంచ క్రికెట్‌లో భారతదేశ ఉనికిని బలంగా చాటింది. భారత క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన ఘట్టమిది. ఎలాంటి అంచనాలు లేకుండానే ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన కపిల్ సేన అద్భుతమైన ఆటతీరుతో 17 రోజుల్లో చరిత్రను తిరగరాసి జగజ్జేతగా నిలిచింది. ఆ విజయంతోనే దేశంలో క్రికెట్ దశ మారి యువతను క్రికెట్ బ్యాట్ వైపు మళ్లేలా చేసింది. 1975లో జరిగిన తొలి ప్రపంచకప్‌లో భారత్ 3 మ్యాచ్‌లలో ఒకటే, అదీ ఎవరూ పట్టించుకోని ఈస్ట్ ఆఫ్రికాపై గెలిచింది. ఆ తరువాత 1979లో జరిగిన రెండో ప్రపంచకప్‌లో ఆ విజయం కూడా దక్కకుండా ఇంటి బాట పట్టింది. వరల్డ్‌కప్‌లు మినహాయించి అప్పటి వరకు కేవలం 10 వన్డే సిరీస్‌లే ఆడిన భారత్ సొంతగడ్డపై 2 మాత్రమే గెలిచి, మిగతా 8 ఓడింది. ఇలాంటి నేపథ్యంతో బరిలోకి దిగిన 1983 ప్రపంచకప్‌లో అడుగుపెట్టింది. కపిల్‌దేవ్ బృందంపై ఎలాంటి అంచనాలు లేవు. అయితే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారనే సామెతనే నిజం చేస్తూ, అందరి లెక్కలను తలకిందులు చేస్తూ తుదిపోరుకు భారత్ అర్హత సాధించింది. అప్పటికే రెండుసార్లు ప్రపంచకప్ నెగ్గి జోరుమీదున్న వెస్టిండీస్‌తో భారత జట్టు తొలి మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. మైదానంలో దిగాక కపిల్ డెవిల్స్ విశ్వరూపం ప్రదర్శించింది. అప్పటి వరకు తూర్పుఆఫ్రికా వంటి చిన్న జట్టుపై తప్ప ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గని భారత్.. వెస్టిండీస్‌పై ఘనవిజయం సాధించడం మన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.అదే ఊపులో రెండో మ్యాచ్‌లో జింబాబ్వేను ఓడించిన కపిల్ సేన తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ చేతిలో ఘోర పరాజయం పాలైంది. అయినా వెరవక ఆ తరువాత జింబాబ్వేపై అద్భుత విజయం సాధించింది. 17 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన జట్టును కపిల్ దేవ్ 138 బంతుల్లో 175 నాటౌట్; 16 ఫోర్లు, 6 సిక్సర్లు కొట్టి ఒంటి చేత్తో ఒడ్డున పడేశాడు. ఆ గెలుపుతో స్ఫూర్తి పొందిన భారత్.. చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను చిత్తుచేసి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. సెమీస్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి తొలిసారి వరల్డ్ కప్ లో ఫైనల్ కు చేరింది టీమ్ఇండియా. జూన్ 25న జరిగిన ఫైనల్లో అద్భుతాన్ని ఆవిష్కరించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కపిల్ సేన ప్రత్యర్థి ముందు స్వల్ప లక్ష్యాన్నే ఉంచినా స్ఫూర్తిదాయక బౌలింగ్‌కు తోడు కపిల్ ఫీల్డింగ్ విన్యాసాలతో విశ్వవిజేతగా నిలిచింది. విండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ ఇచ్చిన క్యాచ్‌ను దాదాపు 20 అడుగుల దూరం వెనక్కి పరిగెడుతూ కపిల్ దేవ్ అందుకోవడంతో స్టేడియం మారుమోగిపోయింది. ముందుగా బ్యాటింగ్ చేసి 183 పరుగులకే కుప్పకూలడంతో ఇక ఆశలు లేకపోయాయి. కానీ కపిల్ డెవిల్స్ మాత్రం తమపై నమ్మకం కోల్పోలేదు. తమ సర్వశక్తులూ ఒడ్డి వెస్టిండీస్ జట్టును 140 పరుగులకే ఆలౌట్ చేసింది. 43 పరుగుల తేడాతో మ్యాచ్ గెలిచి విశ్వవిజేతగా నిలిచిన క్షణాన లార్డ్స్ మైదానం భారత అభిమానుల హోరుతో ఊగిపోయింది.

## టీమ్ఇండియా మంచి జట్టే..

## అందులో సందేహం లేదు కానీ..!



ఇంటర్నెట్‌డెస్క్: టీమ్ఇండియా మంచి జట్టే అయినా ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్‌కు ఎవరూ సాటిలేరని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ పేర్కొన్నాడు.తమ జట్టులో బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిది వంటి మేటి ఆటగాళ్లు ఉన్నారని గొప్పలకు పోయాడు. ఇటీవల ఈ ముగ్గుర్నీ ఐసీసీ అత్యుత్తమ క్రికెటర్లుగా గుర్తించిన నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. మరోవైపు గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్.. టీమ్ఇండియాను ఓడించడంతో ఇప్పుడు ఆ జట్టు ఆత్మవిశ్వాసం, బలం పెరిగిందని చెప్పాడు.దీంతో త్వరలో జరిగే ఆసియా కప్‌లోనూ మరోసారి భారత జట్టును ఓడించి తమ జట్టు విజేతగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. అంతకుముందు లతీఫ్ ఓ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడుతూ.. భారత టీ20 లీగ్ మీడియా హక్కులపై స్పందించాడు. ఈసారి వాటి ధర రూ.48 వేల కోట్లకు పైగా భారీ ధరకు అమ్ముడుపోవడంతో తన అక్కసు వెళ్లగక్కాడు. ఈ టోర్నీ నాణ్యమైన క్రికెట్ కాదని, ఇది కేవలం వ్యాపారమే అని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**